
తెల్లవారబోతోంది.

సెల్ మ్రోగింది. నిద్రమత్తులోనే సెల్ తీసాను. "హల్లో... రవీ... ఆఆ... నేనే. అన్నయ్యను మాట్లాడుతున్నాను. ఏమిటీ...? నాన్నకు హార్ట్ ఎటాక్ వచ్చిందా? ఎప్పుడు?... ఆఆ... నేనిప్పుడే బయల్దేరుతున్నాను. భయపడకు... హాస్పటల్ పేరేమిటీ...? ఆఆ... గుర్తుందిలే..." అంటూ హడావిడిగా మంచం దిగాను.

"ఏమిటండీ... మావయ్యగారికి హార్ట్ ఎటాకా? ఇప్పుడెలా ఉందట?... అక్కడ మరిది ఒంటరిగా ఏ అవస్థలు పడుతున్నాడో... పాపం! నన్ను కూడా మీతోపాటే బయల్దేరమంటారా?" సానుభూతిగా అంది నా భార్య విజయ.



"ఇప్పుడు వద్దులే విజయా. ముందు నన్ను వెళ్లనీ... అక్కడి పరిస్థితిని బట్టి నీకు ఫోన్ చేస్తాను. అప్పుడు వద్దురుగాని. బ్రీఫ్‌కేస్‌లో బట్టలు సర్దు" అంటూ బాత్‌రూమ్‌లోకి దారి తీసాను.

కాఫీ త్రాగి బ్రీఫ్‌కేస్ తీసుకుని బస్‌స్టాండ్ కెళ్లాను. డిపో మేనేజర్‌కి పరిస్థితి చెప్పి, నాలుగు రోజులకి లీవ్‌లెటర్ రాసిచ్చాను. భద్రాచలం వెళ్లే బస్ వచ్చింది. బస్ ఎక్కి సీట్లో వాలాను. సాయంత్రం 6 గంటలకల్లా గుంటూరు చేరాలి అనుకుంటూ కళ్లుమూసుకున్నాను. "భగవంతుడా! నా తండ్రిని కాపాడు" అంటూ మనసులోనే ప్రార్థించాను. ఆయనకి చదువు లేకపోయినా వ్యవసాయంలో రేయింబవళ్లూ కష్టపడి మమ్మల్ని చదివించారు. ఆడపిల్లల పెళ్లిళ్లు చేసారు.

మాది గుంటూరు – నర్సరావుపేట మధ్యలో ఓ పల్లెటూరు. ఆ రోజుల్లో మా నాన్న నాకు డిగ్రీ వరకూ చదువు చెప్పించడం ఓ

# ఊపిరి

విశేషంగా చెప్పుకునేవారు ఆ పల్లెలో. వెంటనే నాకు ఆర్.టి.సి.లో కండక్టర్‌గా ఉద్యోగం వచ్చింది. ఆ తర్వాత పెళ్లీ... పిల్లలూ... వాళ్లు చదువుల్లోకి రావడం చకచకా జరిగిపోయాయి. ఓ పక్క నా సంసారాన్ని చూసుకుంటూనే నా జీతంలో కొంత డబ్బు నాన్నకు పంపుతుండేవాణ్ణి... వేణ్నీళ్లకు చన్నీళ్లు తోడు అన్నట్టు ఇద్దరి సంపాదనతో మా తమ్ముణ్ని బీటెక్ చదివిస్తున్నాం. త్వరలో వాడి చదువు అయిపోతుందని సంతోషిస్తున్న సమయంలో పిడుగులా ఈ వార్త. ఆలోచనల్లోంచి తేరుకునేసరికి బస్సు చిలకలూరిపేట దాటుతోంది. హమ్మయ్య! గుంటూరు వచ్చేసినట్లే. ఇంకో గంట ప్రయాణం. యింతలో ఎంత నిద్ర పట్టేసిందీ... అనుకుంటూ ఒళ్లు విరుచుకున్నాను.

ఆటోలోంచి హాస్పటల్ దగ్గర దిగుతున్న నాకు తమ్ముడు బయటే ఎదురయ్యాడు.

"ఏరా చిన్నా!... నాన్న ఎలా ఉన్నారు?"

"ఫరవాలేదన్నయ్యా! బాగానే ఉన్నారు. సమయానికి హాస్పటల్‌కి తీసుకురావడంతో గండం తప్పిందని చెప్పారు డాక్టర్. ఇంకోసారి ఇలా జరిగితే ప్రమాదమన్నారు..." చెప్పాడు తమ్ముడు.

మేము వెళ్లేసరికి నాన్న ఎవరితోనో మాట్లాడుతున్నారు. ఆ వ్యక్తిని నేను ఇంతకు ముందెన్నడూ చూడలేదు.

"రా రవీ! నాకేమైందనీ... పాపం అంత దూరం నుంచి కంగారుగా వచ్చావా?" అంటూ "వీడేనండీ మా పెద్దబ్బాయి. మీలాగే ఆర్.టి.సి. కండక్టర్. నెల్లూరు డిపోలో ఉద్యోగం" అంటూ ఆ కొత్త వ్యక్తికి నన్ను పరిచయం చేసారు.

అతన్ని నాకు పరిచయం చేస్తూ "వీరి పేరు కృష్ణ. వీరు రాత్రి బస్ ఆపి ఎక్కించుకోకపోతే నేను ఇప్పుడు ప్రాణాలతో ఉండేవాడిని కాదు. నిన్న రాత్రి తొమ్మిది దాటాక స్నానం చేసి అలా కూర్చున్నాను. ఛాతీలో ఒకటే మంట. మీ అమ్మకు చెప్పాను... మనింటి పక్కనున్న చిన్నబ్బాయిని, వెంకయ్యనీ కేకలేసి పిలవగానే అందరూ పరిగెత్తుకొచ్చారు.

నన్ను వాళ్ల చేతుల్తో మోసుకుని రోడ్డు మీదకు తెచ్చారు. ఒక బస్సు ఆగకుండా వెళ్లిపోయింది. ఇక బస్సులు ఉంటాయో, ఉండవో అనుకుంటూంటే ఆఖరి బస్ వచ్చింది. అందరూ కలిసి ఆపమన్నట్లు చేతులూపితే బస్సు ఆపి ఎక్కించుకున్నారు.

మన ఊరివాళ్లు నన్ను హాస్పటల్‌లో చేర్చి, ముందు తమ్ముడికి ఫోన్ చేసారట. తమ్ముడు మీ అక్కయ్యను చూసొస్తానని విజయవాడ వెళ్లాడు. వెంటనే బయల్దేరివచ్చి తెల్లార్లూ నాకు తోడుగా ఉన్నాడు. మన ఊరివాళ్లు నువ్వు వచ్చే ముందే వెళ్లారు" జరిగిన విషయం క్లుప్తంగా చెప్పారు నాన్న.

"కృష్ణగారూ! మీరు చేసిన మేలు మేము ఎప్పటికీ మర్చిపోం" కృతజ్ఞతలు తెలియజేసాను.

"అయ్యో! ఇందులో నేను చేసిన సాయం

**రాజ్యావర్ధన్**

**మొదటి కథ**

ఏముందండీ! నా డ్యూటీ నేను చేసాను. అంతే... అయినా మన ఆర్.టి.సి. ఉన్నది ప్రజాసేవ కోసమే కదా? ప్రయాణీకుల క్షేమమే మనకు శ్రీరామరక్ష!" అన్నాడు కృష్ణ.

"రవీ! వీళ్ల నాన్నగారు ఈమధ్యనే చనిపోయారట పాపం. ఇతనికి పెళ్లికావలసిన ఇద్దరు చెల్లెళ్లు ఉన్నారట. వీళ్ల నాన్న స్కూల్లో అటెండర్‌గా పనిచేసేవారట. రెండునెలల క్రితం రాత్రి 9 గంటల ప్రాంతంలో గుండెనొప్పి వచ్చిందిట. వాళ్ల నాన్నగారిని హాస్పటల్‌కి తీసుకెళ్దామని రోడ్డుమీదకు తీసుకొస్తే లాస్ట్‌బస్ వచ్చిందట. ఆ బస్సునిండా జనం ఉండడంతో చేయెత్తి ఆపమని ప్రాధేయపడినా బస్ ఆపలేదట. అంతే... వాళ్ల నాన్నగారు బస్‌స్టాప్‌లోనే కాలంచేసారట" చెప్పారు నాన్న.

"మీరు ఏ ఊళ్లో ఉంటారు?"

"నెల్లూరు దగ్గర కొవ్వూరులో ఉండేవాళ్లం. అంతా మా దురదృష్టం. మా ఊరి నుంచి ఆటోలు లేవు. వేన్‌లు తిరగవు. నేను ఆ సమయంలో ఇంట్లో లేను. మా అత్తవారింటికి వెళ్లాను. మా అమ్మ, తమ్ముడు, చెల్లెళ్లూ ఉన్నారు. మా నాన్నగారు పోయాక మా వాళ్లను గుంటూరు తీసుకొచ్చేసాను. గుంటూరు – నర్సరావుపేట రూట్ బస్‌కి కండక్టర్‌గా పని చేస్తున్నాను".

"మీరు చెప్పినదాన్నిబట్టి చూస్తే... అది నేను కండక్టర్‌గా డ్యూటీలో ఉన్న సమయంలోనే జరిగిందని అనుమానంగా ఉంది. ఆ సంఘటన ఏ తారీఖున జరిగిందో చెప్పగలరా? బస్ నెంబర్ గుర్తుందా?" ఆతృతగా అడిగాను.

"అయ్యో! నేను ఊహించింది కరక్టే అయింది నాన్నా! ఆ రోజు నా బస్సు ప్రయాణీకులతో కిక్కిరిసి ఉంది. చేయెత్తి వాళ్లంతా ఏదో చెప్తున్నా వినిపించుకోకుండా రైట్ చెప్పాను... నన్ను క్షమించండి".


"మీరేం చేస్తారు? బాధపడకండి... అంతా దేవుడి లీల..."

"బాధపడకుండా ఎలా ఉండమంటారు? మా నాన్నగారికి గుండెనొప్పి అని ఫోన్ రాగానే దారిపొడవునా ఎంతో ఆందోళనతో వచ్చాను. నాలాగే ఆ రోజు మీరంతా ఎంతగా తల్లడిల్లిపోయారో? నేను ఆ రోజు బస్ ఆపి ఉంటే సమయానికి హాస్పటల్‌కి చేర్చేవారు... మీ నాన్నగారు మీకు దూరమయ్యేవారు కాదు కదా? క్షమించండి" అంటూ కృష్ణ చేతులు పట్టుకున్నాను కళ్లలో నీళ్లు తిరుగుతుండగా.

"మాకు మా నాన్న అంతే ఋణం. అంతా విధి లీల... మీరు నిమిత్తమాత్రులు" మనస్ఫూర్తిగానే అన్నాడు కృష్ణ.

"రవీ! ఇంత ఘోరం జరిగిందని కృష్ణగారు మనకు కలవడం వల్ల తెలిసింది కాబట్టి బాధపడుతున్నావు... కానీ ప్రతి నిమిషం ఎంతో మంది ఉద్యోగాలకోసం, ఇంటర్వ్యూల కోసం, పోటీపరీక్షలకోసం, సీరియస్‌గా ఉందని కబురందగానే చివరిక్షణాల్లో వాళ్ల చెంత కొంతసేపయినా ఉందామనీ... ఇలా ఎన్నెన్నో ముఖ్యమైన పనులకు వెళ్లేటపుడు బస్సులు ఆగకుండా పోతుంటాయి. అప్పుడు వాళ్లెంత ఆక్రోశిస్తారో ఊహించు? మనం దేవుడిలా వరాలు ఇవ్వలేకపోయినా సాటివారికి సాయం చేయడం నేర్చుకోవాలి. కొంతమంది మేము బాగుంటే చాలు, పక్కవాళ్ల సంగతి మాకెందుకూ అనుకుంటూ ఉంటారు. అలాకాకుండా, పక్కవారికి మన సాయం అవసరమైనపుడు మన చేతనయినంత సహాయం చేయాలి. ఒక్కొక్కసారి డ్యూటీని డ్యూటీగానే కాక ప్రజాసేవ కోసం మనస్ఫూర్తిగా చేయాలి" చెప్పారు నాన్న.

"రేపు ఉదయం మళ్లీ కలుస్తాను" అని



శలవు తీసుకున్నాడు కృష్ణ.

"నాదొక మాట నాన్నా! వాళ్లకు పోయిన తండ్రిని తెచ్చివ్వలేం కానీ... ఒక సాయం చేద్దామనిపిస్తోంది".

"ఏమిట్రా అదీ..."

"కృష్ణగారికి పెళ్లికావలసిన చెల్లెళ్లు ఇద్దరు ఉన్నారు కదా... వాళ్ల పెద్ద చెల్లెలు బీయీడీ చదువుతోందని అన్నారు. ఆ అమ్మాయిని చూసి, ఇద్దరికీ నచ్చితే మన శ్రీనుకి ఇచ్చి చేద్దాం నాన్నా!"

"ఓ... తప్పకుండా. మంచిమాట చెప్పావ్. అలాగే చేద్దాం!" హామీ ఇచ్చారు నాన్న.

ఆ మర్నాడు కృష్ణ రాగానే విషయం కదిపారు నాన్న. "మీ పెద్ద చెల్లెల్ని మా చిన్నబ్బాయి శ్రీనుకి ఇచ్చి చేద్దామని రాత్రి మా పెద్దాడూ, నేనూ నిర్ణయించుకున్నామయ్యా..." వాళ్లిద్దరూ ఒకరినొకరు ఇష్టపడితేనేలే...

కృష్ణ ముఖం అటు ఆశ్చర్యంతోను, ఇటు ఆనందంతోనూ వెలిగిపోయింది. "మీ అబ్బాయి బీటెక్ చదివాడు. ఎంత కట్నమయినా ఇస్తామని ఎంతోమంది మీ దగ్గరకు వస్తారు. కానీ నేను పెద్దగా కట్నం ఇచ్చుకోలేనండీ..."

"మాకు పైసా కట్నం వద్దు... మీ తాహతు కొద్దీ వివాహం జరిపించండి చాలు. ఇంకా ఏమైనా అవసరమైతే మేమే చూసుకుంటాం... మీ చెల్లెల్నిచ్చి కన్యాదానం చేస్తే చాలు".

కృష్ణ కళ్లల్లో ఆనందంతో నిండిన కన్నీళ్లు రాలాయి. "మీరు చేస్తున్న ఈ మేలు జన్మజన్మలకూ మర్చిపోలేమండీ... ఈ సంతోషకరమైన వార్త మా అమ్మకు, తమ్ముడికి, చెల్లెళ్లకూ చెప్పాలండీ..." అంటూ లేచి నిలబడ్డాడు.

"మీరు మాకు ఎంతో మేలు చేసారు. మా నాన్న ప్రాణాలు కాపాడి మా కుటుంబానికి సాయం చేసారు. నేను మీ నాన్నగారిని మీకు దూరంచేసి మీ కుటుంబానికి ఎంతో ద్రోహం చేసాను. ఈ శుభకార్యం వల్ల మా పాపం కొంతయినా తీరుతుంది" అన్నాను ఉద్వేగంతో. ●